క్లుప్తంగా

సోమశిల జలాలకు హారతి



కలిగిరి: కలిగిరి సమీపంలోని ఉత్తరకాలువ వద్ద సోమశిల జలాలకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లిలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో శనివారం పలు పనులు చేపట్టారు. కుర్రపల్లిలో దెబ్బతిన్న రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఎస్సీ కాలనీలో ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ కరిముల్లా పర్యవేక్షించారు.

తవ్వారు.. వదిలేశారు



అల్లూరు: స్థానిక రాయాజీ వీధిలో డ్రైనేజీ ప్రమాదభరితంగా ఉంది. ఇటీవల డ్రైనేజీలో పూడికను తొలగించేందుకు సగం రోడ్డును నగర పంచాయతీ సిబ్బంది తవ్వారు. ఆ తరువాత పునర్నిర్మించకుండా వదిలేశారు. దీంతో వాహనచోదకులు ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయి గాయాలపాలవుతున్నారు. చిన్నపిల్లలు ఆడుకుంటూ అందులో పడిపోయే ప్రమాదం ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



చేజర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. పెన్నా నదిలోని ఇసుకతో పాటు చెరువులు, కుంటల్లోని మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత అధికారులు తమ వాటా తీసుకుని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదూరుపల్లిలోని శ్మశాన వాటిక పక్కనే ఉన్న నీటి కుంట నుంచి టీడీపీ నాయకుల అండతో కొందరు శనివారం పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలించారు. జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా కుంట మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత పశువైద్యశిబిరం



మర్రిపాడు: పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మర్రిపాడులో శనివారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ డీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ పాడి పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులు అవగాహన కలిగి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏడీ గురుజయంతి మాట్లాడుతూ సకాలంలో ఎదకు రాని పశువులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామని తెలిపారు.

11 మట్టి ట్రాక్టర్లకు రూ.1.65 లక్షల జరిమానా

సోమశిల: పడమటికంభంపాడు చెరువు నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్న 11 ట్రాక్టర్లకు రూ.1.65 లక్షల జరిమానా విధించినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్‌రావు శుక్రవారం తెలిపారు. గత ఆదివారం పడమటికంభంపాడు చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సోమశిల పోలీసులు పట్టుకోగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.15 వేల వంతున జరిమానా విధించి విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

ఏఎస్‌పేటలో భారీ వర్షం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత రెండ్రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తున్నాయి. ఈ క్రమంలో వర్షం పడి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు కాస్తా ఊరట చెందారు. గత కొద్ది రోజులుగా వర్షం లేక మెట్టపంటలు ఎండుతున్న తరుణంలో భారీ వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



• ఈమె పేరు పందిటి విజయమ్మ. కలిగిరి మండలం రావులకొల్లు గ్రామంలో ఆశ వర్కర్‌గా 18 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారిన ఆ చిరుద్యోగి జోలికి ఎవరూ రాలేదు. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అధికార పార్టీ నేత, గ్రామ సర్పంచ్ వెంగపనాయుడు ఆమెపై కక్ష కట్టారు. వైద్యారోగ్య శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆమెను విధుల నుంచి తొలగించారు. ఎమ్మెల్యేను కలిసి ఆమె తనగోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ప్రజా సంఘాల మద్దతుతో పోరాటం చేస్తున్నారు. ఏ తప్ప చేయకున్నా అన్యాయంగా ఎలా తొలగిస్తారంటూ అధికారులను ప్రశ్నిస్తున్నా సమాధానం లేదు.



• ఇతని పేరు బిల్లుపాటి సురేష్. వింజమూరు మండలం జనార్దనాపురం పంచాయతీలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన్ని ఏ కారణం లేకుండానే గత నెలలో విధుల నుంచి తొలగించారు. ఆయన స్థానంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తను నియమించారు. నిబంధనలు పాటించకుండా కేవలం రాజకీయ కక్షతోనే తనను విధుల నుంచి తొలగించారని సురేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీఓఏలపై ప్రతాపం
• ఆశ వర్కర్లను సైతం వదలని తీరు
• మద్యం దుకాణాల సిబ్బంది తొలగింపు
• ఉపాధి క్షేత్రసహాయకులకు ఉద్వాసన
• పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన, పారిశుధ్య, కార్మికులకు తప్పని వేధింపులు

చిరుద్యోగులపై పచ్చకత్తి

ఉదయగిరి: కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందన్న నమ్మకం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు అమలును పక్కన పెట్టి చిరుద్యోగులపై పచ్చకత్తిని సంధించి తొలగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త ఉద్యోగాలు సృష్టించి నిరుద్యోగులకు ఉపాధి చూపకుండా ఉన్న ఉద్యోగాలు పీకివేయడంపై నిరసన జ్వాలలు వెల్లువెత్తున్నాయి. అక్రమ తొలగింపులపై చిరుద్యోగులు ప్రతి సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగే ప్రజాపరిష్కార వేదికలో కలెక్టర్లను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అమలు సాధ్యం కాని హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన టీడీపీ నాయకులు తీరా అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రజలతో పాటు చిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా దానినే నమ్ముకుని ఏళ్ల తరబడి పని చేస్తున్న వారిని నడిరోడ్డున పడేస్తున్నారు. ఆ బాధిత జాబితాలో వీఓఏలు, ఉపాధి క్షేత్రసహాయకులు, మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులు ఉన్నారు. తమ దారికి రానివారిపై అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరించి మరీ టీడీపీ నేతలు విధుల నుంచి తప్పిస్తున్నారు



కలిగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రావులకొల్లు ఆశ కార్యకర్త (ఫైల్)

నిర్ధాక్షిణ్యంగా తొలగింపు

• కలిగిరి మండలం కాకుటూరు, వెలగపాడు వీఓఏలను తొలగించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించుకున్నారు. వెలగపాడు వీఓఏ 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అయినా నిర్ధాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారు. ఉద్యోగం పోతే కుటుంబం వీధిన పడుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వద్ద మొరపెట్టుకున్న ఫలితం లేదని వీఓఏ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నఅన్నలూరు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిని ఏ కారణం లేకుండానే తొలగించారు. అలాగే 12 మంది ఉపాధి క్షేత్రసహాయకులను తొలగించి కొత్తవారిని నియమించారు.

• వింజమూరు మండలంలో మూడు పంచాయతీలు మినహాయించి అన్ని చోట్ల క్షేత్రసహాయకులకు ఉద్వాసన పలికారు. ఎన్నో ఏళ్లుగా విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా కేవలం తమకు అనుకూలమైన సొంత వ్యక్తులనే టీడీపీ నేతలు నియమించుకున్నారు.

• సీతారామపురం మండలంలో 14 పంచాయతీలు ఉండగా, దేవిశెట్టిపల్లి, అయ్యవారిపల్లి మినహా మిగిలిన పంచాయతీల్లో క్షేత్రసహాయకులను తొలగించారు. వారి స్థానంలో అధికార పార్టీకి చెందిన వారిని నియమించారు. పడమటి రొంపిదొడ్లకు చెందిన వీఓఏను తొలగించాలని అధికార పార్టీ నేతలు వెలుగు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

• వరికుంటపాడు మండలంలోని 24 పంచాయతీలు ఉండగా, విరువూరు, రామాపురం, పామూరుపల్లి పంచాయతీలు మినహా మిగిలిన అన్ని చోట్ల క్షేత్రసహాయకులను మార్చారు. తూర్పుబోయమడుగుల, తిమ్మారెడ్డిపల్లిలో పారిశుధ్య పని వారిని మార్చి కొత్తవారిని పెట్టుకున్నారు. వరికుంటపాడుకు చెందిన ఎస్సీ వీఓఏను విధుల నుంచి తొలగించాలని స్థానిక టీడీపీ నేతలు అధికారులపై తీవ్రఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సుమారు 650 మంది సిబ్బంది నూతన మద్యం పాలసీతో ఉపాధి కోల్పోతున్నారు. అలాగే ఇప్పటికే వందలాది మంది వలంటీర్లను తొలగించారు. కొత్త ప్రభుత్వంతో తమ బతుకు చిత్రాలు మారుతాయని ఆశపడిన ప్రజలు, చిరుద్యోగులకు చేదు అనుభవం ఎదురవుతోంది.

ఆత్మకూరు ఆర్డీఓగా పావని బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు నూతన ఆర్డీఓగా బీ పావని శనివారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన ఆమె తల్లిదండ్రులు రైతులు. రైతు కుటుంబానికి చెందిన ఆమె గతేడాది గ్రూప్–1లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. తొలిసారిగా ఆత్మకూరు ఆర్డీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో తొలి పోస్టింగ్ రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన ఆర్డీఓను డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు స్వప్న, సుభద్ర, రమణయ్య, సుధీర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, పలువురు రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఉదయగిరి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మేకపాటి అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయగిరిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్, ప్రొఫెసర్లు నారాయణస్వామి, మాధవ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



కావలి: మాట్లాడుతున్న జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ రామశ్రీనివాసరావు



ఆత్మకూరు: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జగదీష్‌కుమార్

కావలి/ఆత్మకూరు : మహిళలు చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ కే రామశ్రీనివాసరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమధాన్ పేరుతో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులను శనివారం నిర్వహించారు. కావలి, ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయాల్లో జరిగిన సదస్సులకు రామశ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు పలు రకాలుగా మోసాలకు గురవుతున్నారన్నారు. అలాంటి వారు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అలా జరగకుండా వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించేందుకు ప్రతిఒక్కరు బాధ్యత వహించాలన్నారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మోసాలకు గురైన మహిళలు వారికి జరిగిన అన్యాయాన్ని న్యాయవాదుల దృష్టికి తీసుకొస్తే వారికి న్యాయం జరిగేలా మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు కృషి చేస్తుందన్నారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలను వ్యాపారాల నిర్వహణకు అందజేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం భేటి బచావో..భేటి పడావో కార్యక్రమం ద్వారా ఒంటరి బాలికలకు ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం గృహహింస, మనోవర్తి, వరకట్నం, తదితర చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కావలి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎం శోభ మాట్లాడుతూ మహిళలు చట్టాలు తెలుసుకుని ధైర్యంగా పోరాడి గౌరవ జీవితం గడపాలన్నారు. ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జగదీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు చదువుకుని తమ కాళ్లపై తాము నిలబడాలన్నారు. లాయర్ స్వరూప మాట్లాడుతూ మహిళలకు అన్యాయం జరిగినట్లు రుజువైతే పడే శిక్షలను వివరించారు. ఆత్మకూరు సీఐ జీ గంగాధర్, సీడీపీఓ వినీలత, ఆత్మకూరు న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, నందా ఓబులేసు, కేవీ శేషారెడ్డి, తిరుపతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం




దుత్తలూరు: ఏరుకొల్లు సచివాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి అన్నపురెడ్డి వెంగళరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ తుమ్మల చంద్రారెడ్డిని బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు సర్పంచ్‌లు మీసాల సుబ్బరాయుడు, షేక్ మస్తాన్‌బీ శనివారం సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. మాజీ సర్పంచ్ వల్లూరి వెంకటరెడ్డి, కరాది వెంకటేశ్వరరెడ్డి, మహేష్, వెంకటసుబ్బారెడ్డి, షేక్ బాషా పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యత పంచాయతీదే

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలోని వాటర్‌ప్లాంట్ నిర్వహణ బాధ్యత పంచాయతీదేనని సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ శనివారం తెలిపారు. ఎంపీ నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను కొందరు టీడీపీ నాయకులు తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తున్నారన్నారు. అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్ నిర్వహణ పూర్తిగా పంచాయతీ ఆధీనంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


జగన్మాతా నమోస్తుతే




ఉదయగిరి: అన్నపూర్ణాదేవిగా పార్వతిదేవి



కలిగిరి: లలితాత్రిపుర సుందరిగా భద్రకాళి



చేజర్ల: బోడిపాడులో ధైర్యలక్ష్మిగా మహాలక్ష్మి



సంగం: లక్ష్మీదేవిగా కామాక్షితాయి



ఆత్మకూరు: బాలాత్రిపుర సుందరిగా సరస్వతిదేవి



ఆత్మకూరు శివాలయంలో గౌరీదేవి



విశేషాలంకారంలో మానసాదేవి



సీతారామపురం: అన్నపూర్ణాదేవిగా వాసవిమాత



వరికుంటపాడు: అన్నపూర్ణగా నాగార్పమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో మూడోరోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మి, జ్వాలాముఖి ఆలయంలో గాయత్రిదేవి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో గౌరీదేవి, తిరునాళ్లతిప్పపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి, సరస్వతీదేవి ఆలయాల్లో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

అనుమసముద్రంపేట: స్థానిక శ్రీకృష్ణ మందిరంలో గజలక్ష్మి అలంకారంలో కన్యకా పరమేశ్వరి దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా రాజా వెంకటేశ్వర్లు కుమారులు రాజా శ్రీనివాసులు, రాజా బాలాజీ, రాజా సుధీర్, రాజపూటి హజరత్తయ్య కుమారుడు వీర హరీస్, కూరపాటి వెంకటకృష్ణయ్య మనవడు కూరపాటి మధు వ్యవహరించారు.

వరికుంటపాడు : తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో చంద్రగంట, వరికుంటపాడులోని నాగార్పమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సీతారామపురం : ఘటిక సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరి అమ్మవారు వేదమాత గాయత్రీదేవి, సీతారామపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, నారాయణప్పపేటలోని విజయ కనకదుర్గ అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు.

చేజర్ల: బోడిపాడులోని మహాలక్ష్మి ఆలయంలో ధైర్యలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పీ సుబ్బరామిరెడ్డి, పావని వ్యవహరించారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలాలలితాత్రిపురసుందరిగా భక్తులను కటాక్షించింది.

సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో కామాక్షి తాయి అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించింది. తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయం, వంగల్లు భీమేశ్వరస్వామి, దువ్వూరులోని కోటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చింది.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతి సమేత పరమేశ్వర ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు అనుగ్రహించింది.



సీతారామపురం: వేదమాత గాయత్రిగా ఇష్టకామేశ్వరిదేవి



ఆత్మకూరు: గాయత్రిగా జ్వాలాముఖి



ఆత్మకూరు: ధనలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



ఆత్మకూరు: బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి



ఏఎస్‌పేటలో గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

ముమ్మరంగా కాజ్‌వే నిర్మాణ పనులు



బొగ్గేరులో కాజ్‌వే నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం



గండ్లవేడు సమీపంలో చేపడుతున్న కల్వర్టు పనులు

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ–గండ్లవేడు మధ్యన బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బొగ్గేరుపై కాజ్‌వే లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా మూడు మండలాలకు చెందిన 30 గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా అవస్థ పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 21న 12 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణంతో పాటు బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణానికి రూ.9 కోట్లకుపైగా వ్యయ అంచనాలతో పీఎంజీఎస్‌వై మూడో దశ కింద నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభమై చురుగ్గా సాగుతుండడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పొగాకు, పత్తి, మిరప, వరి సాగు చేసే రైతులు తమ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులకు ఈ మార్గం ఎంతో సౌలభ్యంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం



వెన్నవాడ–గండ్లవేడు మధ్య బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణం పూర్తయితే దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆత్మకూరు, నెల్లూరు వైపు అనేక అవసరాల కోసం డీసీపల్లి మీదుగా నిత్యం రాకపోకలు సాగించే వారికి మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఏలూరు సీతారామయ్య, గండ్లవేడు

రైతులకు ఎంతో ప్రయోజనం



బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణంతో వింజమూరు, ఆత్మకూరు, మర్రిపాడు మండలాలకు చెందిన 30 గ్రామాల ప్రజలు, రైతులు ఎంతగానో లబ్ధి పొందుతారు. గతంలో పొగాకు రైతులు తమ ఉత్పత్తులను డీసీపల్లి వేలం కేంద్రానికి తీసుకెళ్లాలంటే నల్లగొండ్ల మీదుగా 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వచ్చేది. కాజ్‌వే పూర్తయితే పది నిమిషాల సమయంలోనే డీసీపల్లికి చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

– ఎం పెంచలనాయుడు, గండ్లవేడు

9 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరిలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. దరఖాస్తు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకు అయినా దరఖాస్తు చేసుకోవచ్చునని, షాపు దక్కించుకున్న వ్యక్తి ఎక్కడైనా పెట్టుకోవచ్చన్నారు. బినామీల పాత్ర లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయన వెంట జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వరరెడ్డి, సీఐ లక్ష్మణస్వామి, ఎస్సై పూర్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

జీవాల దొంగల పట్టివేత



పోలీసుల అదుపులో మహిళా దొంగలు

మర్రిపాడు: జీవాలను అపహరించుకెళ్తున్న దొంగల ముఠాను చిన్నమాచనూరు గ్రామస్తులు శనివారం పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఓ ఆటోలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు చిన్నమాచనూరు గ్రామానికి వచ్చారు. గ్రామంలోని ఓ జీవాల పెంపకందారుడికి చెందిన రెండు మేకలను ఆటోలో ఎక్కించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో గ్రామస్తులు గమనించి పట్టుకున్నారు. వివరాలు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చేలోగా వారిలో ఓ వ్యక్తి పరారయ్యాడు. మిగిలిన వారిని, ఆటోను పట్టుకుని పోలీసులకు అప్పగించగా విచారణ చేపడుతున్నారు.

8న వెలిగొండ ప్రాజెక్ట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం

వరికుంటపాడు : ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈ నెల 8న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం జరగనున్నట్లు ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ వీ రామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించనున్న ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి పనులు పూర్తి చేయాలని, నిర్వాశితుల సమస్యలను పరిష్కరించాలనే అంశాలపై సమావేశం జరుగుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇతర పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అఖిల పక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, మహిళా సంఘాల నాయకులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.